

'జిల్లాను ప్లాస్టిక్ రహితంగా మార్చాలి'

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాను ప్లాస్టిక్ రహితంగా మార్చాలని పౌరహక్కుల సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వారు మున్సిపల్ కార్యాలయ మేనేజర్ రాధాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ కేంద్రం కావడంతో వివిధ ప్రాంతాల నుండి ఉపాధి నిమిత్తం వివిధ అవసరాల నిమిత్తం రోజూ దాదాపు 20 నుండి 30 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. అంతకంటే ఎక్కువ మొత్తంలో ప్లాస్టిక్ కవర్ల రూపంలో గ్లోబల్ వార్మింగ్ పెరిగి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇది మానవాళికి, జంతుజాలానికి ముప్పుగా మారుతున్నాయన్నారు. విచ్చలవిడి ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు చోటుచేసుకునే ప్రమాదముందని వాపోయారు. నిషేధం పై ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయాన్ని చూపించడంలో పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు రవిశంకర్, శేఖర్, దర్బార్, ఆంజనేయులు, నయామతుల్లా, చైతన్య మహిళా సంఘం నాయకులు రూనీస్, లక్ష్మి ,రమణ పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు.. రైతులకు ఉరితాళ్లు

- అధికారంలోకి రాగానే టమోటా జాక్‌పాట్ విధానం రద్దు
- అమూల్ పుంగనూరులో ఎందుకుండదు?
- ముస్లిముల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం
- పాదయాత్రలో నారా లోకేష్



వాల్మీకిపురం : రైతులు ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-వాల్మీకిపురం/కలికిరి

విద్యుత్ మోటార్లకు మీటర్లు రాయలసీమ రైతులకు ఉరితాడుగా మారబోతోందని, నీరు అందక ఎంతో లోతు బోరు తవ్వాల్సి ఉంటుందని. రైతుకు ఒక బోరు మాత్రమే ఉండాలని ప్రభుత్వ అనడం సరికాదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 37వ రోజుకు చేరుకుంది. మంగళవారం కలికిరి ఇందిరమ్మనగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కలికిరి జెఎన్‌టియు వద్ద, వాయల్పాడు మండలంలోని వాండ్లపల్లి, గంధబోయినపల్లి, బీదవారిపల్లి, చింతపర్తి, బోయపల్లి క్రాస్ వరకూ పాదయాత్ర సాగింది. 10.9 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మైనారిటీలు, రైతులు, ఎస్‌టిలతో ముఖాముఖి, విద్యార్థులతో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టమోటా రైతులకు గిట్టుబాటు ధర లేదన్నారు. రోజుకో విధంగా టమోటా ధర మారుతోందని తెలిపారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు తెస్తానని జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని చెప్పారు. టమోటాలు పోయాల్సింది రోడ్ల మీద కాదని తాడేపల్లిలోని జగన్ ఇంటిముందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు చంద్రబాబు 90 శాతం సబ్సిడీ ఇస్తే ఈ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని, ఎరువుల ధరలు, విత్తనాల ధరలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఒక కోర్టు దొంగన్నారు. మంత్రయ్యాక రైతులను పట్టించుకున్నాడా.? అని ప్రశ్నించారు. జగన్ వచ్చాక పవర్, క్రాప్, ఆక్వా హాలిడే వచ్చిందన్నారు. రైతులకు పార్టీలుండవనీ, రాయలసీమకు టిడిపి హయాంలో రూ.13 వేల కోట్లు ఖర్చు పెట్టామన్నారు. తాను 26 రైతు భరోసా కేంద్రాలు చూశాననీ ఎప్పుడు చూసినా తాళాలు వేసి ఉంటున్నాయని తెలిపారు. టమోటా రైతుల దగ్గర నుండి 100 బాక్సుల్లో 20 బాక్సులు జాక్ పాట్ తీస్తున్నారనీ, ఒక్క రైతు భరోసా ఇచ్చి సబ్సిడీలన్నీ రద్దు చేశారని యూరియా తప్ప ఆర్బీకేలో ఏమీ ఉండటం లేదని రైతులు లోకేష్ ఎదుట వాపోయారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో జాక్ పాట్ విధానం రద్దు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. జగన్ అమూల్ తెచ్చారు కానీ అది పుంగనూరులో ఉండదన్నారు.

ముస్లిముల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తాం

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి టిడిపి చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారురు. లోకేష్ తలపెట్టిన యువగలం పాదయాత్రలో భాగంగా మంగళవారం ఉదయం నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డితో కలిసి ముస్లిం మైనార్టీల సదస్సులో పాల్గొని వారి సమస్యల పట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులు లోకేష్‌కు వారి సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తగా వాటికి అన్నిటికీ సమాధానం చెప్పారు. తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీలను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని, వారికి గౌరవ ప్రదమైన స్థాయిని కల్పించిన ఘనత టిడిపిదేనని ప్రతి ముస్లిం సోదరుడు ఇది గమనించాలన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయన్ను పలు ప్రశ్నలు అడిగారు. ఉర్దూ మీడియం చదివి చాలా మంది యువత నేడు ఉద్యోగాలు లేక పోస్టులు భర్తీ కాక, పెళ్లిళ్లు కాక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, వక్ఫ్ ఆస్తులకు సంబంధించి జ్యుడీషియల్ పవర్ ఇవ్వాలని ప్రముఖ సాహితీవేత్త వేంపల్లి అబ్దుల్ ఖాదర్ కోరారు. యువత మాట్లాడుతూ దూదేకుల కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బయట దేశాలకు వెళ్లిన వారికి ఆపద వస్తే ఆదుకోవడానికి సహకారం, ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు కొరకు నారా ప్రభుత్వం వస్తే ఏమి న్యాయం చేస్తారో చెప్పాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాగానే ఉర్దూ చదివిన వారికి డిఎస్‌సి పెట్టి పోస్టులు ఇస్తామని, ఇస్లామిక్ బ్యాంకును తప్పకుండా ఏర్పాటు చేస్తామని, విదేశాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొనే వారికోసం గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఎపిఎన్‌ఆర్‌టిని ఏర్పాటు చేసి దాని ద్వారా వారికి సహాయ సహకారాలు అందజేసేవారిమని, ఇప్పుడున్న ప్రభుత్వం ఆ వ్యవస్థను నాశనం చేసి ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని మేము తిరిగి అధికారంలోకి రాగానే మళ్లీ ఆ బోర్డును క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులకు జ్యుడీషియల్ పవర్ తప్పనిసరిగా తీసుకువస్తామని వారికి హామీ ఇచ్చారు. సదస్సు అనంతరం పాదయాత్ర ప్రారంభించి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా విద్యార్థులతో ముచ్చటించి కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే తెలుగుదేశం పార్టీని ఆదరించాలని వారికి తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి హనీఫ్, హజరత్ ముస్తఫా, టిడిపి నాయకులు, ముస్లిం మైనార్టీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



లోకేష్‌తో ముఖాముఖికి హాజరైన రైతులు

ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను అనుసరించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీష ఎన్నికల జిల్లా నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ విసి హాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ, తదితర ఏర్పాట్లపై ఎన్నికల జిల్లా నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి ఎన్నికలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సరైన వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. చెక్‌లిస్ట్ ఆధారంగా అన్ని పనులు సకాలంలో పూర్తి చేసేలా పంచాయతీరాజ్ ఇంజినీర్లతో సమన్వయమయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలని పంచాయతీరాజ్ ఎస్ఇని ఆదేశించారు. ఎలాంటి చిన్న పొరబాటు లేకుండా ఎన్నికలను నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడంతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 ఇవ్వాలని సూచించారు. బుధవారం నాటికి అన్ని డివిజన్‌లకు మెటీరియల్ చేరుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఎంసిసి, వెబ్ కాస్టింగ్, తదితర వాటిపై కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజల పక్షాన పోరాడే వారిని గెలిపించండి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రజల పక్షాన పోరాడే ఉద్యమ నేపథ్యం కలిగిన అభ్యర్థులను గెలిపించుకోవలసిన అవసరం విద్యావంతులైన పట్టభద్రులకు ఉందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎస్ రద్దు కాంట్రా క్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సమస్యలను ప్రభుత్వంతో పోరాడి సాధించ కలిగే అభ్యర్థులను గెలిపించుకోవాలని పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్, 198కి పైగా ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజాసంఘాల మద్దతుతో పోటీ చేస్తున్నానని ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య మనుగడ కష్టంగా ఉందని రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని, లౌకికవాద స్ఫూర్తిని మంటగల్పుతున్నారన్నారు. విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్నారని చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని పేర్కొన్నారు. రాయలసీమ వనరులను కొల్లగొడుతున్నారని కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నారని పేదల సంక్షేమం లేదని ఇలాంటి పరిస్థితుల్లో మన ఓటును రాజ్యాంగ పరిరక్షణ కోసం సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తున్న తనను గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు చంద్రశేఖర్, హరి నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జాన్ ప్రసాద్, సిపిఐ నాయకులు సిగి చెన్నయ్య, కాంగ్రెస్ నాయకులకు శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటి నిర్ణయం మేరకు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు విజయానికి కృషి చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ అల్లా బకాష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాగ రాజు విజయాన్ని ఆకాంక్షిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దశ్శాలువా పూలమాలతో నాగరాజును కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాగరాజు విజయానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాగరాజు మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ యువతీ యువకుల ఉపాధి మహిళల సంక్షేమం కొరకు వెనుకబడిన సీమ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి శాసనమండలిలో నా వాణి వినిపిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహబూబ్‌బాషా, చెన్నకృష్ణ, గౌస్, రఫి, మంజునాధ, మహిళా సంఘాల నాయకులు రమణమ్మ, భాగ్యలక్ష్మి, ఖాజాబి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డిసి వెంకటయ్య పాల్గొన్నారు.



రైల్వేకోడూరు : మాట్లాడుతున్న పోతుల నాగరాజు

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- జెసి తమీమ్ అన్సారీయా

ప్రజాశక్తి - రాయచోటి

శాసన మండలి ఎన్నికల నిర్వహణకు నియమ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్నమయ్య, పుట్టపర్తి, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన జేసీలు, డిఆర్ఒలు, నోడల్ అధికారులతో శాసనమండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అనంతపురం జిల్లా రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్లోని మినీ విసి హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ ఓ సత్యనారాయణ, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శాసన మండలి ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు భద్రతగా ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకున్నామని తెలిపారు. బ్యాలెట్ పత్రం, బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై పిఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, నార్మల్, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు, తదితర ప్రాంతాల వద్ద నియమ నిబంధనల మేరకు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జరగబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులందరికి కేటాయించామన్నారు అంతకు ముందు అనంతపురం జిల్లా రిటర్నింగ్ అధికారి , కలెక్టర్ నాగలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాన్ పవర్, ట్రైనింగ్, మెటీరియల్, బ్యాలెట్ పేపర్, ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల ప్రొక్యూర్మెంట్, ఎలెక్టోరల్ రోల్స్, మైక్రో అబ్జర్వర్స్, వెబ్ కాస్టింగ్ తదితర కార్యక్రమాలను పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాల్లో క్షుణ్ణంగా వివరించాలన్నారు.

నెలాఖరులోగా బ్యాంకు రుణాల పంపిణీ పూర్తి

- లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ఈ ఏడాది మార్చి చివరిలోగా మంజూరైన రుణాలను లబ్ధిదారులకు చెల్లించి లక్ష్యాలు పూర్తి చేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం పీలేరు ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన బ్యాంకర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ మేనేజర్లు తమకిచ్చిన రుణాల లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. విద్య, వ్యాపార, గృహ నిర్మాణ, కార్ల కొనుగోళ్ల కోసం కూడా రుణాలను మంజూరు చేయాలని చెప్పారు. డి.ఆర్.డి.ఎ డిపిఎం లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 10,05,064 స్వయం సహాయక సంఘాలకు రూ.830.98 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాల పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.733.52 కోట్లు రుణాలుగా అందించినట్లు చెప్పారు. సమావేశంలో పీలేరు ఎంపిడిఓ మురళీమోహన్ రెడ్డి, పీలేరు భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, వెలుగు ఏపిఎం లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి



జాతరలో సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పోలీస్ సిబ్బంది

జాతరలో సూచిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-చిన్నమండెం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సురభి బస్ మార్ట్ అధినేత బి.ఓబుల్‌రెడ్డి ఆర్థిక సహాయంతో సూచిక బోర్డులను ఎస్ఐ రమేష్‌బాబు, ఇఒ కొండారెడ్డి ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లూరమ్మ జాతరకు చుట్టుపక్కల నుంచి ప్రజలు అత్యధికంగా తరలివస్తారని అన్నారు. వారికి ఇబ్బంది కలగకుండా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఓబుల్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ ఆటంకం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎవరికి ఎక్కడ ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ఆపన్న హస్తంగా సహాయం చేస్తున్నారని అభినందించారు. జాతరకు వచ్చే ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా మీ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. తిరుగు ప్రయాణంలో ఇళ్లకు సురక్షితంగా చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరిష్‌చంద్ర, భాను, పోలీసు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవోపేతంగా హోలీ పౌర్ణమి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని వైబివిఎన్‌పల్లి గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హోలీ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచారి భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ ప్రత్యేక పూజలలో పెద్ద ఎత్తున మహిళలు, ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు. వసంత ఋతువు ప్రారంభానికి, వసంతోత్సవానికి గుర్తుగా హోలీ పండుగను జరుపుతారని తెలిపారు. పౌర్ణమి రోజు ఫాల్గుణి నక్షత్రము ఉండుట చేత ఈ పౌర్ణమి హోలీ పౌర్ణమిగా పిలుస్తారని చెప్పారు.



సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

ఘనంగా విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-కలకడ

పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువు తున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి నట్టు ప్రధానోపాధ్యాయుని షావలి, అనిత తెలిపారు. మండల కేంద్రమైన కలకడ స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి కాబోతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఓ సిహెచ్ నారాయణ, ఎంఇఒ మునీంద్రనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్ మాయలో పడి విద్యకు దూరం కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, అప్పుడే పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తెచ్చిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మస్తాన్‌అహ్మద్, రెండు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వైద్య సేవలనుందిస్తున్న వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి

మాతా శిశు మరణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- కలకడ

మాతా శిశు మరణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి ఎన్‌వి.కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలో కలకడ దొడ్డిపల్లి, కె. దొడ్డిపల్లిలో డాక్టర్ యం. వి. కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్య కార్యకర్త ఆశాలకు ఆదేశించారు. అదనపు హిమాగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. మాతృ శిశు మరణాలు జరగకుండా జాగ్రత్త వహించాలని తెలియజేశారు. కొన్ని అదనపు పరీక్షల కొరకు ఉన్నత స్థాయి వైద్యశాలలకు పంపించారు. 60 సంవత్సరములు పైబడిన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో జనరల్ ఓపి 123 మంది, 11 గర్భిణులు, బాలింతలు4, షుగర్ వ్యాధులు 40, రక్తపోటు 56, ఒక కేన్సర్ రోగికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, సూపర్వైజర్ రెడ్డమ్మ, గణాంధిక అధికారి రోజా, ఆరోగ్య కార్యకర్త సి.లక్ష్మీదేవి ,ఎంఎల్ హెచ్‌పిఎస్ జె.గోపికృష్ణ, ఫైలెట్ రమేష్, ఆశ కార్యకర్తలు కె.అమరావతి. కె.పద్మావతి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని తపస్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రామానుజులు నాయుడు పేర్కొన్నారు. సోమవారం తపస్య పాఠశాలలో ఐదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ, ప్రొపెసర్ ఎస్‌వి.సత్యనారాయణ, జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివి.శివప్రసాద్, కన్సల్టెంట్ నారాయణ హాస్పిటల్, పి.శ్రీధర్ రెడ్డి కరెస్పాండెంట్ శ్రీనివాస్, జూనియర్ కాలేజ్ కలికిరి, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా జాన్పోర్ వ్యక్తిత్వ వికాసనిపుణులు బాబు పాల్గొన్నారు. ముఖ్య అతిధులు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఎస్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లలకి సెల్ ఫోన్లను ఇచ్చి గారాబం చేయకుడదని అన్నారు. డాక్టర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ ఆహార నియమాలు తప్పక పాటించాలన్నారు. పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకో వాలన్నారు. ఒత్తిడికి లోనుకావద్దని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్య క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది, శివప్రసాద్, మాధవి, లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-కలకడ

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపిడిఒ సిహెచ్.నారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కలకడ కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు రాజకీయంగా , ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మునీంద్ర నాయక్, ప్రిన్సిపల్ అనిత, ఆరోగ్య సిబ్బంది హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **కలికిరి :** మహిళలు అన్ని రంగాల్లో చైతన్యం సాధిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి పురుషులు కూడా తోడ్పాటునివ్వాలని కోరారు. డాక్టర్ ఐ. జ్యోతి మాట్లాడుతూ మహిళలు వారికి ఇష్టమైన రంగాల్లో మరింతగా ముందుకెళ్లడానికి కృషి చేయాలన్నారు. తర్వాత డాక్టర్ కె.నవీన, డాక్టర్ మాధురి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మహిళా రైతులు స్వాతి, రాధా లను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, బోధన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **రామాపురం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చిట్లూరు సెక్టార్ పరిధిలోని రాచపల్లి పంచాయతీ గంగానేరు, వడ్డేపల్లి అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంత వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఐసిడిఎస్ పీడీ జిల్లా పంచాయతీ ఆఫీసర్ ధనలక్ష్మి, సిడిపిఒ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్న వయసులోనే పెళ్లి చేస్తే చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని ఆమె తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ పీడీ, జిల్లా పంచాయతీ ఆఫీసర్ ధనలక్ష్మిని ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి, ఇఒపిఆర్‌డి ఉషారాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి, రామపురం ఇఒపిఆర్‌డి ఉషారాణి, సూపర్వైజర్ అరుణమ్మ, పద్మజ గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెడ్డిబిందు, అంగన్వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మన రాజ్యాంగంలో మహిళలకు రక్షణ కల్పించే అనేక చట్టాలు ఉన్నాయని వాటి గురించి మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాజంపేట పట్టణ ఎస్ఐ వి.లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన సమా వేశంలో మహిళలనుద్దేశించి ఆయన మాట్లాడారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని, వారికి మరింత ప్రోత్సాహం అందించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డా.పురుషోత్తమ్ మాట్లాడుతూ మహిళా విద్యార్థులు సిగ్గు, బిడియం వదిలి పురుషులతో ధీటుగా అన్ని విషయాలలో ముందంజలో ఉండాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా పరిపుష్టి పొంది సాధికారత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఎస్ఐ వినాయక పేర్కొన్నారు. స్థానిక మాసాపేట సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగపు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు.



కలకడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సిహెచ్.నారాయణ

ముఖ్యఅతిదులుగా రాయచోటి ఇన్స్పెక్టర్లు ఇనయతుల్లా, శివ బాబు నాయక్, మహిళ అధ్యాపకులు మహిళా విద్యార్థులతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కరుణాకర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** స్త్రీలలో తల్లి పాత్ర అత్యంత బలమైనదని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఒ.నిర్మల పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, వసుంధర, భగీరథి, లక్ష్మీ, నరసమ్మ, నారాయణమ్మ పాఠశాల పిఇటి కరుణాకర్, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** మనదేశంలోని చట్టాలకు కుల మత జాతి వివక్షతలు ఉండవని జూనియర్ సివిల్ జడ్జి ఎం. అంజని ప్రియదర్శిని అన్నారు. రైల్వే కోడూరు మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి అంజనీ ప్రియదర్శిని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వెంకటరామరాజు, న్యాయవాది శంకరయ్య, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఇ.ప్రేమలత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.ఎ.శ్రీలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ సుబ్రమణ్యం రాజు, ఉమామహేశ్వరి, శ్రావణి, శివయ్య , పెంచలయ్య, డాక్టర్ శ్రీనివాసులు, టి.శ్రీనివాసులు, డి.వెంకటేశ్వర్లు, విశ్వనాథ, రమణ, సురేంద్ర, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** దేశాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. మహిళా రిజర్వేషన్ 33 శాతం విద్య, ఉద్యోగాలలో అమలు చేస్తున్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం, బాల్యవివాహ నిషేధ చట్టం, గృహహింస చట్టం,దిశా చట్టం, తల్లిబిడ్డ ఎక్స్ప్రెస్, ప్రసవాలకు ఆరు నెలల సెలవు, పిల్లల సంరక్షణ సెలవు, సుకన్య సంవృద్ధి యోజన పథకం, భేటి పదావో భేటి బచావో, కస్తూరిబా బాలికల విద్యాలయాలు నెలకొల్పి మహిళల విద్యకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా లో కూడా జెసి తమీమ్ అంశారియా, అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ శైలజ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ, డిప్యూటి డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మీ, మాస్ మీడియా అధికారి దేవ శిరోమని, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి పీడీ ధనలక్షి అనేకమంది మహిళలు డాక్టర్ లుగా,ఉపాధ్యాయులుగా, పోలీ సులుగా వారి,వారి శాఖలలో సేవలు అందిస్తూన్నారు.



భోజనం వడ్డిస్తున్న చిన్న సుబ్బయ్య యాదవ్

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రం పుల్లంపేటలోని కనక దుర్గమ్మ తిరుణా మహోత్సవానికి వచ్చిన భక్తాదులకు విభిన్న ప్రతిభా వంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి నట్లు పుల్లంపేట అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. 1800 మంది వరకు అన్నదానం చేశామని ఇంత గొప్ప కార్యక్రమం చేపట్టినందుకు సంతోంగా ఉందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విహెచ్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్ చేతులు మీదుగా ప్రారంభించడం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన భక్తాదులకు విభిన్న ప్రతిభావంతులు అన్నదానం చేపట్టడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గుణశేఖర్, ఓబయ్య, కోశాధికారి నరసింహులు సభ్యులు జ్యోతీశ్వర్, వాలంటీర్లు మురళి, నాగార్జున పాల్గొన్నారు.

పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోం

ప్రజాశక్తి-ములకలచెరువు

ఈనెల 11 నుంచి తంబళ్లపల్లి నియోజకవర్గంలో ప్రారంభం కానున్న లోకేష్ పాదయాత్ర అడ్డుకోవాలని చూస్తే సహించమని ఃనియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శంకర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ద ఆధ్వర్యంలో స్థానిక కెజిఎన్ కళ్యాణ మండపంలో నాయకులు, కార్యకర్తలతో పాదయాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఏడాది క్రితం జరిగిన ద్విచక్ర వాహన ర్యాలీ కేసు ఇప్పుడు తెరపైకి తెచ్చి పాదయాత్రలో పాల్గొననివ్వకుండా చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల11న నియోజకవర్గంలోకి పాదయాత్ర ప్రారంభ మవుతుందన్నారు. లోకేష్‌కు స్వాగతం పలకడానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొనేలా చూడాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో రాజశేఖరా బాబు, నియోజకవర్గ పరిశీలకుడు గురువారెడ్డి, మాజీ జడ్‌పిటిసి శంకర్, నాయకులు కుడుంశ్రీనివాసులు, సురేంద్రయాదవ్, త్యాగరాజు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేద్దామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.శంకర్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర ఈ నెల 11 తారీకు న కుబరబలకోట మండలం అంగల్లులో జరిగే పాదయాత్రకు మండలాల మండల అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, రైతులు పాల్గొని సంఘీబావం తెలపాలని కోరారు.

ఇంజినీరింగ్ ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

చాపాడు :జెఎన్‌టియు అనంతపురం వారు ఇటీవల విడుదల చేసిన ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం మొదటి సెమిస్టరు పరీక్షా ఫలితాల్లో స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో ఇసిఇ విభాగానికి చెందిన ఎన్.సుష్మ 90.89శాతం, యు.వెంకటసుబ్బమ్మ 90.89, డి.గురుభారతి 89.11, సిఎస్‌సి విభాగానికి చెందిన జె.భవ్యశ్రీ 86.11, కె.మోహనశ్రీ 86.11, జి.అలీ సాలేలెహ్ 86శాతం, ఇఇఇ విభాగానికి చెందిన యు.గంగాజ్యోతి 85.89, బి.శ్రేయ 85.56, పి.రాగసుధా 85, మెకానికల్ విభాగానికి చెందిన ఎం.ధరణీధరణ్ రెడ్డి 83.22, కె.గంగా సురేంద్రరెడ్డి 82.89, ఎం.సలీం బాగ్ 80.78, సివిల్ విభాగానికి చెందిన ఎం.ధవనీశ్వర్‌రెడ్డి 84.56, సి.సూర్యనారాయణ 81.89శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

లోకేష్‌ను కలిసిన కుడుము శరత్

బి.కొత్తకోట : యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర విశేష స్పందన లభిస్తోందని టిడిపి బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కుడుము శరత్ పేర్కొన్నారు. మంగళవారం కలికిరిలో జరిగిన పాదయాత్రలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళానికి యువత, మహిళలు, రైతులు, కార్మిక, కర్షకులు ఇలా అన్నివర్గాల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రజలే స్వచ్ఛంగా తరలివచ్చి లోకేష్ పాదయాత్రలో పాల్గొంటున్నారని తెలిపారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నందలూరు : మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆడపూరు గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, జూనియర్ ఇంటర్ (ఎంపిసి) (బైపిసి) ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశం కొరకు విద్యార్థునిలు (బాలికలు మాత్రమే) దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మాధురిలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం జూనియర్ ఇంటర్‌కు జరుగుతాయన్నారు. ఆన్లైన్ అప్లికేషన్ కొరకు ఇతర వివరాలకు 9491410474,7799251393 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశం ఈనెల 24న వరకు ఉంటుందన్నారు.

ముఖాముఖికి హాజరు కండి

మదనపల్లె అర్బన్ : యువగళం కార్యక్రమంలో నారా లోకేష్‌తో ముఖాముఖిగా మాట్లాడేందుకు వాల్మీకులందరూ హాజరుకావాలని వాల్మీకి సంఘం నాయకుడు పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న లోకేష్ పాదయాత్ర నియోజక వర్గానికి చేరుతుందన్నారు. వాల్మీకులకు ఎస్‌టి పునరుద్ధరణ గురించి, సమస్యల గురించి వినతి పత్రాన్ని స్వీకరించడానికి వాల్మీకులతో ముఖాముఖి కార్యక్రమాన్ని వాల్మీకుల కోసం ఉదయం 8 గంటల నుండి ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పులి శ్రీనివాసులు, సాద్దల జయసింహ, గాది భాస్కర, వలసల మంజునాథ్, పరాపట్ల నరసింహులు, బొంత శ్యామలమ్మ, బొంత సోమశేఖర్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ ఎంపికలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కాకినాడలోని ద్రోణ అకాడమీలో జరగబోయే 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మహిళలు, పురుషుల ఫెన్సింగ్ పోటీలకు ఈ నెల తొమ్మిదవ తేదీన క్రీడా వికాసంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చంద్రకళావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే ప్రతి ఫెన్సింగ్ క్రీడాకారుడు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగి ఉండాలని, 2023 ఫిబ్రవరి 1వ తేదీ నాటికి 13 ఏళ్ల వయస్సు నిండిన వారై ఉండాలన్నారు. 13 ఏళ్ల వయస్సు పైబడిన వారు గతంలో ఆడిన ఫెన్సింగ్ సర్టిఫికెట్ లేదా సర్టిఫైడ్ ఫెన్సింగ్ కోచ్ వద్ద కనీసం ఒక సంవత్సరం అనుభవ పత్రముతోపాటు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్పోర్ట్ సైజు ఫోటోలు, వారి వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలను తీసుకొని హాజరు కావాలని పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూమును పరిశీలించిన కలెక్టర్

మదనపల్లె అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జడ్పీ హైస్కూల్ ఆవరణలోని స్ట్రాంగ్ రూమును కలెక్టర్ గిరీష మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రలోభాలకు తలొగ్గకుండా నచ్చిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఓటర్లకు ఇది చక్కటి అవకాశమని తెలిపారు.

పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లో తనిఖీ

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ గోదామును కడపజోనల్ మేనేజర్ బి.బాలకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. చౌక దుకాణాలకు సర ఫరా చేయు బియ్యము, చక్కెర, కందిపప్పు నిలువల దస్త్రాలను పరిశీలించారు. ప్రతి చౌక దుకాణానికి బియ్యమును తూకాలు వేసి సరిగ్గా ఇవ్వాలని సూచించారు. ఐసిడిఎస్, మధ్యాహ్న భోజన పథకం కింద ఫోర్టిఫైడ్ బియ్యమును మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. ప్రతినెల రికార్డులు రీకన్సిలేషన్ తప్పకుండా చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు, గోదాము ఇన్చార్జి మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



గోదాములో తనిఖీ చేస్తున్న జోనల్ మేనేజర్ బాలకృష్ణ



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

80 మంది వృద్ధులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం సహకారంతో మదనపల్లి లయన్స్ కంటి ఆస్పత్రి, ఐటెల్ గ్రూపు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ కంటి వైద్యులు అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక పిహెచ్‌సిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 80 మంది హాజరు కాగా వారికి కంటి పరీక్షలను నిర్వహించామన్నారు. వీరిలో 20 మంది వరకు కంటి ఆపరేషన్లు అవసరమైన వారు ఉన్నారని, దశలవారీగా కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసి, కంటి అద్దాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ఆస్పత్రి సిబ్బంది అంజిరెడ్డి, షఫీ, రెడ్డప్ప, ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, పిహెచ్ఎన్ సరోజ, సూపర్వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ కొరత లేకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-కలికిరి

వేసవిలో వ్యవసాయ రైతులకు విద్యుత్ కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు ట్రాన్స్‌కో ఇఇ సురేష్ తెలిపారు. మంగళవారం ఆయన కలికిరి ఎడిఇ కార్యా లయంలో అధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ మాసంలో రైతులు ఎక్కువగా వరి నాట్లు వేయడం వలన విద్యుత్ ఎక్కువగా అవసరం ఉంటుందని, దానికి తగ్గట్టు అన్ని సబ్ స్టేషన్లలో కెపాసిటర్లు ఎక్కడ సమస్యలు లేకుండా చూసి, వారికి అవసరమైన 9 గంటల నాణ్యమైన విద్యుత్తును రెండు దఫాలుగా అందించడానికి చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అంతేకాకుండా గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వద్దకు వచ్చిన విద్యుత్తు ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి ఏర్పాటు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రజలు విద్యుత్ చౌర్యాన్ని అరికట్టి పొదుపు చేయాలని, వీధిలైట్లు, ఇంట్లో ఫ్యాన్, లైటు అనవసరంగా వాడకుండా విద్యుత్తును ఆదా చేసి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో ఎడిఇ శ్రీనివాసులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, రైతులు

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగు లాభదాయకమని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాఘవరాజుపురంగ్రామంలో కె.చంద్రశేఖర్ రాజు అరటి తోటలో పొలంబడి కార్యక్రమానికి సుకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను మండల పరిధిలో హాస్టల్ కు, పాఠశాలలకు అందించాలని అందించాలన్నారు. అరటి పంట పరిశీలించి పంట విశ్లేషణా ఆధారంగా నిర్ణయాలు తీసుకుని ఆచరణ పద్ధతిని చార్ట్ రూపంలో రాయించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట ఉద్యానవన కళాశాల ప్రొపసర్ డాక్టర్, శివరామకృష్ణ,అసిస్టెంట్ ప్రొపసర్ డాక్టర్. తనూజ, కోడూరు ఉద్యాన శాఖ అధికారి ఆషియా, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, జడ్పిటిసి సభ్యులు రత్నమ్మ, సర్పంచ్ ఆర్వి. రమణ మాస్టర్ ట్రైనర్ వేల్పుల సిద్ధయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఉద్యానవన కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



మృతుడు కొండూరు వెంకటేష్ (ఫైల్ పోటో)

మండల పరిధిలోని వెంకట రాజంపేట వద్ద మంగళవారం వెంకట రాజంపేట అరుంధతి వాడకు చెందిన కొండూరు వెంకటేష్ (63) అనే వ్యక్తిని రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రున్ని స్థానికులు చికిత్స కోసం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతుడిని తిరిగి రాజంపేట ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

మదనపల్లె అర్బన్ : ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఇద్దరు నిందితులకు ఒక్క సంవత్సరం 6 నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ మదనపల్లె రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇంటూరి ప్రవీణ్ కుమార్ తీర్పు ఇచ్చారని మదనపల్లి టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలో ఒక ద్విచక్ర వాహనాన్ని పుంగనూరుకు చెందిన శివకుమార్, లక్ష్మీపతి ఇద్దరినీ చోరీ చేసిన కేసులో అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాలను దొంగలించే నేరస్తులను పట్టుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించామని ఆ దర్యాప్తులో భాగంగా ఈ ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన వివరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎపిపి ఉమాదేవి వ్యవహరించారని తెలిపారు.

బావిలో మృతదేహం లభ్యం

మదనపల్లె అర్బన్ : మండలంలోని కొండమారిపల్లి పంచాయతీ ఇసుక నూతపల్లి సమీపంలోని ఓ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది. సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి బావిలో చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మదనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని వెలికి తీసి జిల్లా ఆస్పత్రిలోని మార్చరీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు వివరాలు. పట్టణంలోని బీసీ కాలనీలో కాపురముంటున్న శ్రీనివాసులు తన భార్య వెన్నెల(22) ఈనెల 2న పుట్టింటికి వెళతానని కోరగా అదే రోజు ఉదయం 9.30 గంటలకు కందుకూరుకు పోవుటకు ఆటో ఎక్కించి పంపించాడన్నారు. అనంతరం శ్రీనివాసులు తన అత్తకు ఫోన్ చేసి వెన్నెల ఇంటికి వచ్చిందా అని అడగగా, రాలేదని సమాధానం చెప్పిందన్నారు. స్నేహితులు, బంధువులు, చుట్టుపక్కల వారి ఇళ్లలో వెతికినా వెన్నెల ఆచూకీ లభించలేదని తెలిపారు. ఇక చేసేది లేక మంగళవారం పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.